
# భిన్నస్పర్శ

బి.పి.కరుణాకర్



**జీపు దిగి పోలీసు స్టేషన్‌లోకి నడిచి నా గదిలోకి వెళ్లి టోపీ బల్ల మీద పెట్టి కుర్చీలో కూర్చోబోతుంటే రంగయ్య వచ్చి ఫేన్ స్విచ్ నొక్కాడు. వాచీ చూసుకున్నాను. ఒకటీ అయిదయింది.**

రంగయ్య వెళ్లి పోబోతుంటే, 'నాకో గ్లాసు మంచి నీళ్లు తెచ్చి పెట్టు, టీ ఉందా?' అడిగాను.

"ఉంది సార్"

"వేడిగా ఉంటే పట్టుకురా"

రంగయ్య తలూపి స్వింగ్ డోర్స్ తెరుచుకుని వెళ్లిపోయాడు.

గదిలో గాలి వేడిగా తిరుగుతోంది. చొక్కా పై గుండీలు విప్పి బెల్టు వదులు చేసుకుని కుర్చీలో చేరగిలబడి కూర్చున్నాను. చీకటి గుమ్మం దగ్గిరే ఆగి ఉంది. హెడ్ కానిస్టేబులు గదిలోకి వస్తుంటే, "మస్కిటో కాయిల్ ఇక్కడ ఒకటి వెలిగించి పెట్టే

ఏర్పాటు చేయకూడదా రసూల్?" అడిగాను.

"పెట్టిస్తాను సాబ్."

"ఎవరయినా ఫోను చేశారా?"

"లేదు సాబ్"

"కేసులు ఏమయినా వచ్చాయా?"

"నరసింహం, చలపతి ఒకతన్ని తీసుకువచ్చారు. సెల్‌లో పెట్టాం."

"కేసేమిటి?"

"తీవ్రవాది అన్న అనుమానంమీదపట్టుకొచ్చారు."

"స్క్వాడ్ వాళ్లకు ఫోను చేసి చెప్పారా?"

"చెప్పలేదు సాబ్. మీతో మాట్లాడిన తర్వాత వాళ్లకు ఫోను చేస్తే బావుంటుందని ఆగాను."

"చలపతిని రమ్మనమను" అన్నాను. రసూల్ వెళ్లిపోయాడు.

రెండు నిమిషాల తర్వాత చలపతి లోపలికి వచ్చి సెల్యూట్‌చేసి బల్ల దగ్గిరగా వచ్చి నిలబడ్డాడు.

"ఎవర్ని పట్టుకొచ్చింది?" అడిగాను.

"తీవ్రవాదిలా ఉన్నాడండీ" అన్నాడు చలపతి.

"తీసుకొచ్చి ఎంతసేపవుతోంది?"

"అరగంట"

"అతను తీవ్రవాది అని ఎందుకు అనుమానం వచ్చింది?"

"మాకు తెలిసిన వ్యక్తి సమాచారం ఇచ్చాడండీ'

"సెర్చ్ చేశారా?"

చలపతి తలూపాడు.

"ఏమయినా దొరికాయా?"

చలపతి నా ముఖంలోకి బ్లాంక్‌గా చూశాడు.

"పిస్తోలుకాని, కత్తికాని, బాంబులు కాని....' అంటోంటే నామాటలకు అడ్డు వచ్చి "అటువంటివేం దొరకలేదు సార్" అన్నాడు.

"మీరు పట్టుకోబోయే ముందు అతనేం చేస్తున్నాడు?"

"సైకిలు మీద వీధుల్లో తిరుగుతున్నాడు. నేనూ నరసింహం అరగంట పాటు వెంబడించి పట్టుకుని అర్ధ రాత్రప్పుడు వీధుల్లో ఎందుకు తిరుగుతున్నావని నిలదీసి అడిగాం. సరయిన సమాధానం చెప్పలేదు. నాలుగు పీకితే 'మీతో మాట్లాడడం అనవసరం. నామీద అనుమానం ఉంటే పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లండి. మాట్లాడేదేదో మీ సి.ఐతో మాట్లాడతానన్నాడు. తీసుకొచ్చి సెల్‌లో పడేశాం. మొండి ఘటంలా ఉన్నాడు. అన్నాడు చలపతి.

"నువ్వెళ్లి అతన్నిక్కడకు పంపించు"

చలపతి బయటకు వెళ్తోంటే "రంగయ్యా" అని కేకేశాను.

"అయ్యా! వచ్చే "అంటూ రంగయ్య గదిలోకి వచ్చాడు.

మంచినీళ్ల గ్లాసు అందుకుని నీళ్లు తాగి ఖాళీ గ్లాసు బల్ల మీద పెట్టి " టీ బల్ల మీద పెట్టి నువ్వెళ్లి మస్కిటో కాయిల్ పంపించమని రసూల్‌తో చెప్పు " అన్నాను.

రంగయ్య బయటకు వెళ్లి వెంటనే కాయిల్ తో వచ్చి బల్ల కింద పెట్టి వెళ్తోంటే తీవ్రవాదిగా అనుమానించబడిన వ్యక్తి గదిలోకి వస్తూ నమస్కారం చేశాడు.

తలూపి అతన్ని పరిశీలనగా చూశాను. అతనికి ముప్ఫయి అయిదు సంవత్సరాలుంటాయేమో, చామన చాయలో ఉన్నాడు. అంత పొడుగూ కాదు; పొట్టీ కాదు. సన్నగా ఉన్నాడు.

"కూర్చోండి" కుర్చీ చూపించాను.

కూర్చున్నాడు. తెల్లటి చొక్కా చినిగిపోయిఉంది. మా వాళ్లు బాగానే కొట్టినట్లున్నారు. ముఖం వాచి పోయి ఉంది. కింద పెదవి చిట్లి నల్లగా ఉంది.

గ్లాసులోని టీ సగం నేను పోసుకుని అతనికి గ్లాసు ఇస్తూ, "తీసుకోండి" అన్నాను.

"థేంక్స్" అని గ్లాసు అందుకున్నాడు.

అతను టీ తాగిన తర్వాత "మీ పేరు?" అడిగాను.

"కోటయ్య"

"మీదే ఊరు?"

"శ్రీకాకుళం"

"ఏం చేస్తుంటారు?"

"అక్కడే గవర్నమెంటు డిగ్రీ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరరుగా పనిచేస్తున్నాను. స్పాట్ వేల్యుయేషన్ నిమిత్తం విశాఖపట్టణం వచ్చాను. పోర్టు ట్రస్ట్‌లో పనిచేస్తున్న నా స్నేహితుడి ఇంట్లో దిగాను. స్పాట్ వేల్యుయేషన్ మొన్నటితో ముగిశాక దాని తాలూకు డబ్బులు అందుకున్నాను. నాకు ఉన్న దాంట్లో కొద్దో గొప్పో దీనాతి దీనంగా బతుకుతున్న వాళ్లకు డబ్బు రూపేణా కాకుండా వస్తు రూపేణా ఇవ్వడం నా అలవాటు. ఈ సంగతి ఎవరికీ తెలియకుండా చేస్తుంటాను. ఇక్కడకు నన్ను మీ వాళ్లు తీసుకువచ్చారు కాబట్టి మీకు చెప్ప వలసివస్తోంది. ప్రతి సారీ ఇలానే చేస్తుంటాను. నాకు వచ్చిన డబ్బుతో ఇరవయి రగ్గులు కొని మొన్న రాత్రి రిక్షా మాట్లాడుకుని ఫుట్‌పాత్‌ల మీద, చెట్ల కింద పడుకున్న వాళ్లకు పంచాను - పది వరకు. ఇంకో పది రగ్గులు మిగిలాయి.మొన్న నా కూడా వచ్చిన రిక్షావాడినే ఈ రాత్రి రమ్మని అడిగితే వంద రూపాయలిస్తేగాని రానన్నాడు. వాడితో లాభం లేదనుకుని మరో నలుగురిని అడిగాను. ఈ రిక్షా వాళ్లందరూ ఒకే యూనియన్ మనుషులనుకుంటాను, అందరిదీ ఒకే మాట అయింది. వందకు ఎవరూ తగ్గలేదు చివరకు ఒక సైకిలు అద్దెకు తీసుకుని రగ్గులు క్యారియర్‌కు కట్టుకుని వీధి వీధి తిరుగుతూ పంచడం మొదలెట్టాను. రెండో మూడో మిగిలాయి. వాటిని పంచే ప్రయత్నంలో ఉండగా మొన్న నాకూడా వచ్చిన రిక్షావాడే మీ పోలీసులను తీసుకు వచ్చాడు. వాడు నా గురించి మీ వాళ్లకు ఏం చెప్పాడో తెలియదు. మీ వాళ్లు నన్ను పట్టుకున్నారు. నేను చెప్పేదేదీ వాళ్లు వినిపించుకోలేదు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ బూతులు తిడుతుంటే బూతులు ఎందుకు తిడుతున్నారని నేను అడిగినందుకు కొట్టారు. చొక్కా పట్టుకుని పోలీసు స్టేషనుకు లాక్కొస్తుంటే నా ఐడెంటిటీ కార్డు ఎక్కడో పడిపోయింది. నా కళ్ల జోడు కిందపడి విరిగిపోయింది.....మీకు నా స్నేహితుడి అడ్రసు ఇస్తాను. మీరు ఎవరినయినా పంపించి నా గురించి వాకబు చేయించండి...." ఆవేశం ఎక్కువవుతుంటే ఆగాడు.

కొద్దిసేపు మౌనంగా ఉండి అతని ఆవేశం తగ్గిన తర్వాత లేచి నిలబడి, "మిమ్మల్ని నమ్ముతున్నాను. జరిగిన దానికి బాధపడుతున్నాను. మా వాళ్లతరఫున క్షమించమని కోరుకుంటున్నాను." అంతకన్నా ఏం మాట్లాడాలో నాకు అర్థం కావడంలేదు.

అతను లేచి నిలబడ్డాడు.

నా ఇరవై సంవత్సరాల సర్వీసులో ఇష్టం ఉన్నా లేక పోయినా, అర్హులైనా కాక పోయినా ఉద్యోగ రీత్యా నాపై అధికారులు, నేతలకు ఎందరికో ఎన్నోసార్లు సెల్యూట్‌చేశాను. కోటయ్యకు మటుకు మనఃపూర్వకంగా సెల్యూట్ చేయకుండా ఉండలేక పోయాను. ●

**పోస్ట్‌మాన్**

పశ్చిమ బెంగాల్‌లోని పూర్ణియా జిల్లాలో ఈనాటికీ గంటలు మోగించుకుంటూ ఉత్తరాలు పట్టుకొని పరిగెత్తి పోస్టల్ రన్నర్స్ వున్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది.

ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అనువుగా వుండదు. అందుకే పోస్టు బాబులు గంటలు మోగించుకుంటూ ఉత్తరాల సంచీతో పరిగెత్తుకుంటూ మారుమూల గ్రామాలకు కూడా వెళ్ళి ఉత్తరాలు అందిస్తుంటారు!

ముద్దా రమణమూర్తి
అనంతపురం